నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం | సెప్టెంబర్ 04, 2024 | www.navatelangana.com

మొండివాగులో ఒకరు గల్లంతు

నవతెలంగాణ-మోర్తాడ్

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి గల్లంతైన ఘటన మోర్తాడ్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోనీ మొండివాగు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. చాపలు పట్టడానికి గుర్తుతెలియని వ్యక్తి వెళ్లగా ప్రమాదవశాత్తు అందులో జారిపడినట్టు స్థానికులు తెలిపారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.


గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో మహిళల ధర్నా

నవతెలంగాణ-బిచ్కుంద



గత పది రోజులుగా మిషన్ భగీరథ నీళ్ల రాకపోవడంతో మండల కేంద్రంలోని 4, 5 వార్డులకు చెందిన మహిళలు, కాలనీవాసులు ఖాళీ బిందెలతో గ్రామపంచాయతీ ముందు ధర్నా చేశారు. జీపీ ద్వారా వార్డులలో బోరు మోటర్ ఏర్పాటు చేసినా.. మోటార్లు చెడిపోవడంతో గత పది రోజులుగా మిషన్ భగీరథ నీళ్ల రాకపోవడంతో తీవ్ర తాగు నీటి ఎద్దడి ఏర్పడిందని గ్రామపంచాయతీ కార్యదర్శికి సిబ్బందికి ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శుద్ధమైన తాగునీరు దొరకకపోవడంతో వేరే నీరు తాగడం వలన అనారోగ్యానికి గురవుతున్నామని ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి తమకు తాగునీరు అందించి వార్డు ప్రజలు అనారోగ్యాం బారిన పడకుండా కాపాడాలని మహిళలు కోరారు.

అనుక్షణం పర్యవేక్షించండి

- నీటి ప్రవాహంతో ఎవరికీ నష్టం వాటిల్లకుండా చూడండి
- కలెక్టర్, సీపీలతో కలిసి ఎస్సారెస్పీని సందర్శించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- వర్ష ప్రభావిత ప్రాంతాల స్థితిగతులపై అధికారులతో సమీక్ష


బాల్కొండ : ఎస్సారెస్పీ నుంచి 41 గేట్ల ఎత్తడం ద్వారా దిగువకు పరవళ్లు తొక్కుతున్న గోదావరి

నవతెలంగాణ-బాల్కొండ/ఆర్మూర్

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా పెద్ద ఎత్తున మిగులు జలాలను దిగువ గోదావరిలోకి విడుదల చేస్తున్న దృష్ట్యా పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, బోధన్ శాసన సభ్యులు పి. సుదర్శన్ రెడ్డి సూచించారు. ఎవరు కూడా గోదావరి నది పరిసరాల్లోకి వెళ్లవద్దని, అవాచనీయ ఘటనలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు. అదే విధంగా నీటి ప్రవాహాలను అనుక్షణం పర్యవేక్షిస్తూ, ఎక్కడ కూడా ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లకుండా సరైన ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని ప్రాజెక్టు అధికారులకు సూచించారు.

నిజామాబాద్ జిల్లా పోచంపాడ్ లో గల శ్రీరాంసాగర్ రిజర్వాయర్‌ను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. డ్యామ్ సైట్ పైకి చేరుకుని, ఎగువ ప్రాంతాల నుండి రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతున్న వరద ప్రవాహాన్ని, 41 ఫ్లడ్ గేట్ల ద్వారా దిగువకు వదులుతున్న మిగులు జలాలను పరిశీలించారు. ఎస్సారెస్పీలోకి మంగళవారం మధ్యాహ్నం సమయానికి 2.50 లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. నీటి విడుదల విషయంలో నిర్లక్ష్యానికి తావిచ్చినా, అనవసర తప్పిదాలకు పాల్పడితే పరీవాహక ప్రాంతాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుందని అన్నారు.

అంతకుముందు ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్, సీపీలతో కలిసి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి వర్ష ప్రభావిత ప్రాంతాలలో నెలకొని ఉన్న పరిస్థితుల గురించి ఆయా శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. పంటలకు సాగు నీటి విషయమై రైతుల్లో ఒకింత ఆందోళన నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో గడిచిన మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు అన్ని జలాశయాలు, చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నీటి నిల్వలను సంతరించుకున్నాయని అన్నారు. ప్రస్తుత ఖరీఫ్ పంటలతో పాటు, వచ్చే రబీ సీజన్ కూడా పంటలకు సమృద్ధిగా సాగు నీరు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, ఎగువన మహారాష్ట్రలోని ప్రాజెక్టుల నుండి మిగులు జలాలను విడుదల చేసినందున ఎస్సారెస్పీకి వరద ప్రవాహం మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. సుమారు 4 లక్షల క్యూసెక్కులకు పైగా ఇన్ ఫ్లో వచ్చి చేరుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఏకధాటిగా కురిసిన వర్షాల వల్ల మరో మూడు రోజుల పాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి పెద్ద ఎత్తున వరద ప్రవాహం కొనసాగనుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని దిగువ పరీవాహక ప్రాంతాలైన మెండోరా, మోర్తాడ్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి తదితర మండలాల పరిధిలోని గోదావరి తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హితవు పలికారు. వీరి వెంట శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాసరావు గుప్తా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ వి.లావణ్య. మాజీ ఎమ్మెల్సీ అరుల నర్సారెడ్డి, గడుగు గంగాధర్, ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, ప్రాజెక్ట్ ఏఈఈ వంశీ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.


ఎస్సారెస్పీ పరివాహక ప్రాంతంపై సూచనలిస్తున్న సుదర్శన్‌రెడ్డి


వరిపొలంలోకి కొట్టుకు వచ్చిన ఇసుక, రాళ్లు, మట్టి

పొలాల్లో ఇసుక మేటలు

- వరద మిగిల్చిన బురద
- ప్రతిసారీ ఆర్థికంగా నష్టపోతున్న రైతులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు చోట్ల రైతులకు తీవ్ర నష్టం చేకూర్చాయి. వరదతో పొలాలకు ఇసుక మేటలు, రాళ్లు వచ్చాయి. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలో పలువురి రైతులకు చెందిన పంట పొలాల్లో రాళ్లు, ఇసుక, మట్టి మేటలు వేసాయి. మండల కేంద్రం నుండి ఉప్లూర్ వెళ్లే దారిలో ఉన్న కల్వర్టు భారీ వర్షాల మూలంగా కోతకు గురవడంతో వరద ఉధృతికి కొట్టుకోవచ్చిన రాళ్లు, ఇసుక సమీపంలోని పంట పొలాల్లో మేటలు వేశాయి. కోన సముందర్, అమీర్ నగర్ గ్రామాల మధ్య బీటీ రోడ్డు కోతకు గురైన ప్రదేశంలో వరద ఉధృతికి కొట్టుకొచ్చిన మట్టి, ఇసుక, రాళ్లు సమీప వరి పొలాల్లో మేటలు వేసాయి. ఉప్లూర్ రోడ్డులో రెండు నెలల క్రితం కూడా భారీ వర్షాలకు రైతులు వరి నాట్లు వేసుకునేందుకు సిద్ధం చేసిన వరి నారు మడులు ఇదేవిధంగా రాళ్లు, ఇసుకతో కప్పబడిపోయాయి. మరికొందరు రైతులకు చెందిన అప్పుడే వేసిన వరి పొలాలు ఇసుక మెటలతో దెబ్బతిన్నాయి. దీంతో గత్యంతరం లేక రైతులు వరి నాట్లతో సహా పొలాల్లో మెటలు వేసిన ఇసుకను, రాళ్లను, మట్టిని మొత్తం బ్లేడ్ ట్రాక్టర్‌తో ఎత్తిపోసుకున్నారు. మళ్లీ ఇతర రైతుల వద్ద వరి నారును కొనుగోలు చేసుకుని వరి పొలాలు వేసుకున్నారు. అయితే ప్రస్తుతం వరి పొలాలు వేసి ఇప్పటికే సుమారు 50 రోజులుగా కావొస్తుంది. ఈ పరిస్థితుల్లో వరి పొలాల్లో వేసిన రాళ్లు, ఇసుక మేటలను తొలగించుకునే ఆస్కారం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇసుక, రాళ్లను తొలగించే ప్రయత్నం చేస్తే వరి పొలాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క వేసుకున్న పంట నష్టపోగా, మరోపక్క పొలాల్లో వేసిన మేటలను తొలగించుకునేందుకు ఆర్థికంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా భారీ వర్షాల మూలంగా పొలంగట్లు కోతకు గురై మళ్లీ మళ్లీ గట్లను ఏర్పాటు చేసుకోవాల్సిన వస్తుందని దీంతో శ్రమ ఎక్కువైతుందని ఆదేవన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి తమ పంట పొలాల పరిస్థితి ఏంటోనని ఆందోళన చెందాల్సిన పరిస్థితి తమకు నెలకొందని రైతులు మదన పడుతున్నారు.


పొలంలో పేరుకుపోయిన ఇసుక



మాట్లాడుతున్న రమేశ్‌బాబు

నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారీ వర్షాలు, వరదల వలన నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల మూలంగా పొలాల్లో నీరు నిలిచి వేసిన పంట కుళ్లిపోయే పరిస్థితికి వచ్చిందని, ఫలితంగా రైతులు నష్టపోతున్నారని, అనేక చోట్ల కల్వర్టులు తెగిపోయినట్టు తెలిపారు. రోడ్లు కోతలకు గురై రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వర్షాల మూలంగా పాత ఇండ్లు కూలిపోయి పేదలు ఉన్న గూడు చెదిరిపోవటంతో రోడ్డున పడ్డారని తెలిపారు. నష్టపోయిన రైతులు, ప్రజలను ఆదుకోవటానికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జరిగిన నష్టానికి అధికారులు అంచనాలు వేసి వారిని ఆదుకోవాలని తెగిన రోడ్లను కల్వర్టులను పూడ్చి రాకపోకలను అంతరాయం తొలగించాలని కోరారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు మూలంగా రోజువారి పనులకు వెళ్లే వారికి ఉపాధి లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అటువంటి నిరుపేదలను, ఇండ్లు కూలిన వారికి నిత్యావసర సరుకులను అందజేయాలని కోరారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి నివాసాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో వందలాది ఎకరాల్లో ఇసుక మేటలు చేరి పంట పొలాలు దెబ్బతిన్నాయని వాటిని సరి చేయటానికి కావలసిన ఆర్థిక సహకారాన్ని ప్రభుత్వం అందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చిత్త శుద్ధితో పనిచేయాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నగర అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, వివిధ విభాగల మున్సిపల్ ఉన్నత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరై మాట్లాడారు. రెవిన్యూ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగల పై ప్రజల నుండి అనేక పిర్యాదులు వస్తున్నాయని అన్నారు. నగరంలో రోడ్స్, డ్రైనేజీ, శానిటేషన్ విషయంలో మొదటి నుండి హెచ్చరించామని, వర్షాకాలనికి ముందే కాలనీలో కనీసం గుంతలు అయినా పుడ్చాలని చెప్పిన పూర్తి కాకపోవడం పై మండిపడ్డారు. బీటీతో గుంతలు పుడ్చాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ రెవిన్యూ పెంచి, ఖర్చులు తగ్గించుకొని మున్సిపల్ కి వచ్చే ప్రతి పైసా నగర అభివృద్ధికి ఖర్చు చేయాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులంత అప్రమత్తంగా ఉండాలని, స్టామ్ వాటర్ లోతట్టు ప్రాంతాలలో తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. చిన్నారి అనన్య సంఘటన మనందరిని కల్చివేసిందని అలాంటి సంఘటనలు పునరావృతం కావొద్దని అధికారులను హెచ్చరించారు.

నష్టపోయిన పేదలను ఆదుకుంటాం

- కామారెడ్డి పట్టణంలో ప్రభుత్వ సలహదారు షబ్బీర్‌అలీ పర్యటన


నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణం వర్షంలో మునిగిన లోతట్టు ప్రాంతలలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పర్యటిస్తూ అధికంగా ఆర్థికంగా నష్టపోయిన వారికి ఆర్థిక సాయం అందిస్తూ వారికి భరోసా కల్పించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో కామారెడ్డి నియోజకవర్గంలో అత్యధిక వర్షపాతం నమోదు కావడం కామారెడ్డి పట్టణంలో వివిధ కాలనీలో ఇండ్లు నీట మునగడం ఇళ్లలోకి నీళ్ల రావడం రోడ్లన్నీ కొట్టుకపోవడం ప్రజలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. దీంతో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ ఆయా శాఖల ఉన్నతాధికారులతో కలిసి లోతట్టు ప్రాంతాలలో తిరుగుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ నిరుపేదలై అధిక నష్టానికి గురైన వారికి ఆర్థిక సాయం అందజేస్తూ ఆదుకుంటామని వారికి భరోసా కల్పించారు.


పట్టణంలో నష్టం వాటిల్లిన రోడ్లను పరిశీలిస్తున్న అలీ..


నష్టపోయిన బాధితులతో మాట్లాడుతూ..

అనంతరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో సమీక్షించారు. ఈ సమీక్షలో అధికారులకు ఆదేశాలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు దిశా నిర్దేశం వరద బాధితులకు సహాయక చర్యల్లో ముందు వరుసలో ఉండాలని కోరారు. భారీ వర్ష సూచన తో లో తట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టరేట్లలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేసినట్టు తెలిపారు. భారీ వర్షాల సమయంలో అత్యవసర సేవల కోసం పోలీస్ బెటాలియన్లకు ఎన్డీఆర్ఎఫ్ తరహా లో శిక్షణ, వరదల కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు 5 లక్షల ఆర్థిక సాయం, వరదల్లో చనిపోయిన పశువులు, మేకలు,గొర్రెల కు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఇలాంటి విపత్కర పరిస్థితిలో ప్రతిపక్షాలు రాజకీయ చేయడం మాని ప్రజలకు మంచి చేసే విధంగా సలహాలు సూచనలు ఇస్తూ వారికి అండగా ఉంటూ సహాయపడుతూ ఉండాలని ప్రతిపక్ష నాయకులకు హితవు పలికారు.



ఉగ్ర గోదావరి

- ఎగువ ప్రాంతం నుంచి కొనసాగుతున్న 2.40 లక్షల ఇన్‌ఫ్లో
- 41 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

గోదావరి ఉగ్రరూపం దాల్చింది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు పెద్దఎత్తున వరద ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం సైతం ఎస్సారెస్పీకి 2.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. దీంతో 41 గేట్లు ఎత్తి 2.15 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా.. వరద కాలువకు 17 వేలు, కాకతీయ కాలువకు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4000 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ దిగువన గల జల విద్యుత్ కేంద్రంలో నాలుగు టర్బైన్ల ద్వారా సామర్థ్యానికి మించి ఉత్పత్తి చేస్తున్నట్టు జెన్కో డిఈఈ శ్రీనివాస్ తెలిపారు.


మునిగిపోయిన వంతెన

వరదొస్తే బాన్సువాడకు బస్సుబంద్

నవతెలంగాణ-గాంధారి

వర్షాకాలం వచ్చిందంటే భారీ వర్షాలు కురిస్తే బాన్సువాడకు బస్ సేవలు బంద్ అవుతున్నాయి. గాంధారి మండలంలోని సర్వాపూర్ వాగు వద్ద ఎప్పుడో 30 సంవత్సరాల క్రితం సర్వాపూర్ వాగుపై బ్రిడ్జి నిర్మించారు. బ్రిడ్జి రోడ్డుకు లోతుగా ఉండడంతో భారీ వర్షాలు కురిసినప్పుడు వరదలు రావడంతో బ్రిడ్జిపై నుంచి నీరు పారుతూ గాంధారి-బాన్సువాడకు రాకపోకలు రెండు రోజులపాటు నిలిచిపోతున్నాయి. దీంతో గాంధారి-బాన్సువాడకు రాకపోకలు బంద్ కావడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు నిజామాబాద్ వెళ్లి అక్కడ నుంచి బాన్సువాడకు వెళ్లాల్సి వస్తుంది. లేదా ఎల్లారెడ్డి వెళ్లి అక్కడి నుండి బాన్సువాడకు వెళ్తున్నారు. భారీవర్షాలు కురిసిన ప్రతిసారీ ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని మండల వాసులు ఆవేదన చెందుతున్నారు. లెవల్ వంతెనతో ఇక్కట్లు పడుతున్నామని, ఎమ్మెల్యే మదన్‌మోహన్ స్పందించి బ్రిడ్జి నిర్మించాలని మండల వాసులు, వాహనదారులు కోరుతున్నారు.

నీటిప్రవాహం చోట రోడ్డు దాటొద్దు

- కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-మద్నూర్

భారీగా కురుస్తున్న వర్షాలు మూలంగా వాగుల ప్రవాహం ఎక్కువగా ఉన్నచోట ప్రజలు రోడ్డుమీదనుంచి పారే వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డి శ్రీనివాస్ రెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం నాడు మద్నూర్ మండలంలోని గోజేగావ్ గ్రామం వద్ద గల లెండి వాగు ప్రవాహాన్ని పరిశీలించి, వాగు పరిస్థితులు, వంతెన స్థితిగతులు అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్న కారణంగా లెండి వాగును మండల తహసీల్దార్, ఎంపిడిఓ తో కలిసి పరిశీలించారు. నిన్న వాగు పై నుండి నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ రోజు వాగును పరిశీలించారు. వాగు ప్రవాహం ఎక్కువగా ఉంటే గ్రామస్తులు వాగులు దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అని తెలిపారు. అదనపు కలెక్టర్ లేండి వాగు సందర్శన కార్యక్రమంలో మద్నూర్ మండల తహసీల్దార్ ఏండి ముజీబ్, ఎంపిడిఓ రాణి, ఎంపీఓ నర్సయ్య, గిర్దవర్ శంకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.


లెండి వాగును పరిశీలిస్తున్న అధికారులు

విలేకరులు కావలెను

నవతెలంగాణ

తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి, సామాజిక స్పృహతో స్పందించే ఉత్సాహం.. అవినీతి, అక్రమాలను వెలికితీసే ధైర్యం, ప్రశ్నించేతత్వం, ప్రజాసమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా..? ఆ అవకాశాన్ని 'నవతెలంగాణ' కల్పిస్తోంది. ఖాళీ మండలాల్లో భర్తీకి ఆహ్వానిస్తోంది

ఖాళీ మండలాలు

నిజామాబాద్ జిల్లా

నిజామాబాద్‌టౌన్, బోధన్ టౌన్, వేల్పూర్, భీంగల్, రుద్రూర్, ఆలూర్, డొంకేశ్వర్, మెండోరా

కామారెడ్డి జిల్లా

కామారెడ్డి టౌన్, బాన్సువాడ, బీర్కూర్, రాజంపేట్, మాచారెడ్డి, పాల్వంచ, తాడ్వాయి, జుక్కల్ రూరల్

నవతెలంగాణ బుక్‌హౌజ్‌లో పనిచేసేందుకు ఇన్‌చార్జి కావలెను

అడ్రస్ : నవతెలంగాణ దినపత్రిక కార్యాలయం సుభాష్‌నగర్. ఎస్‌బిఐ పక్కన, నిజామాబాద్.

సంప్రదించాల్సిన నెంబర్లు :
94945 73764, 94900 99408

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
బుధవారం | సెప్టెంబర్ 04, 2024 | www.navatelangana.com

నీట మునిగిన తడపాకల్ దాసాంజనేయ స్వామి ఆలయం



నీటమునిగిన ఆలయం

నవతెలంగాణ-ఏర్గట్ల

శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో ప్రాజెక్టు అధికారులు మంగళవారం 41 గేట్లు ఎత్తేయడంతో గోదావరి నది, మిగతా ప్రాంతాలకు 2,59,928 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. ఇందులో భాగంగా తడపాకల్ గోదావరి నదికి వరద పోటెత్తింది. దీనితో గోదావరి నదీ పక్కన గల దాసాంజనేయ స్వామి ఆలయం నీట మునిగింది. చూసేందుకు ఆలయ గోపురం ఒకటే కనబడుతుంది. ఒక పక్క అధికారులు రెండు రోజుల నుండి గోదావరీ నదీపరివాహక ప్రాంతాలకు ప్రజలెవ్వరు వెళ్ళవద్దని, జాగ్రత్త పాటించాలని హెచ్చరికలు జారీ చేస్తున్న విషయం తెలిసిందే.

వరద ఉధృతిని పరిశీలించిన ఆర్డీవో



వరదను పరిశీలిస్తున్న ఆర్డీవో

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం వద్ద నీటి ఉధృతిని బోధన్ ఆర్డీఓ రాజేశ్వర్ మంగళవారం మధ్యాహ్నం పరిశీలించారు. బ్రిడ్జికి ఆనుకుని వెళ్తున్న నీటి ప్రవాహాలను ఆయన పరిశీలించి ఇటువైపున సందర్శకులను రానివ్వకూడదని స్థానిక ఎమ్మార్వో శ్రావణ్ కుమార్ ఆదేశించారు. ఘాట్ల వద్దకు భక్తులు కూడా రాకూడదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం బ్రిడ్జిపై నుంచి రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసినట్టు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఆర్ఐ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ల నియామకం చేపడతాం

- జిల్లా వైద్యాధికారి రాజశ్రీ
- సాలూర పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-బోధన్

త్వరలో డాక్టర్ల నియామకం చేపడతామని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ అన్నారు. మంగళవారం సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఓపి వివరాలను, సిబ్బంది పనితీరును, రిజిస్టర్లను ఆమె తనిఖీ చేశారు. జిల్లా వైద్యాధికారి ఆసుపత్రికి వచ్చిన సమాచారం తెలుసుకున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సింగడి పాండు ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై జిల్లా వైద్యాధికారికి విన్నవించారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది సక్రమంగా



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రాజశ్రీ

లేకపోవడం వలన రోగులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఎంబిబిఎస్ డాక్టర్ లేకపోవడం వలన డెలివరీలు కావడం లేదని అన్నారు. 12 సబ్ సెంటర్లు కలిగి ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, సరైన డాక్టర్‌ను కేటాయించకపోవడం సరికాదని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుండి ఈ ఆసుపత్రికి ఎందరో పేషెంట్లు వస్తారని వారి సౌకర్యార్థం తక్షణమే డాక్టర్‌ను కేటాయించాలని కోరారు. స్పందించిన జిల్లా వైద్యాధికారి సానుకూలంగా స్పందించి ఆసుపత్రిలో త్వరలో డాక్టర్ నియామకం చేపడతామని తెలిపారు. ఆమె వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో హెల్త్ క్యాంప్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని బ్లాక్-2లో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధులకు గురయ్యే అవకాశం ఉన్నందున ఈ హెల్త్ క్యాంపు నిర్వహించారు. హెల్త్ క్యాంపులో ఆరోగ్య సిబ్బంది 75 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు వర్షాలు కురుస్తున్నందున ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు క్రిష్ణవేణి, స్వరూప, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, అంగన్వాడీ టీచర్ బాలమణి, ఆశా కార్యకర్తలు శోభ, సాగరిక తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని, పట్టణంలో కురుస్తున్న వర్షాల కారణంగా రహదారులు వార్డులలో కూడా మురికి వర్షపునీరు నిలవడంతో రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డ కారణంగా వాహనాలకు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే అలాంటి వాటిని గుర్తించి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సిపిఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాదరి నరేష్ మాట్లాడుతూ.. పట్టణంలో 36వ వార్డుల్లో రోడ్ల వ్యవస్థ చాలా అధ్వాన్నంగా తయారైనా.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటే మున్సిపల్ అధికారులు వార్డ్ కౌన్సిలర్లు ప్రజ సమస్యలు పరిష్కారం చేయకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రమేష్, సిపిఐ మండల నాయకులు లక్ష్మి నర్సయ్య, మహిళా సంగం నాయకురాలు కుంట మంగ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల సంచారం.. భయాందోళనలో ప్రజలు



గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో గుంపులు గుంపులుగా కుక్కలు రోడ్లపై తిరుగుతుండడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు రోడ్లపై వెళ్లాలంటేనే జంకుతున్నారు. గుంపులు గుంపులుగా వస్తున్న శునకాలు ఎక్కడ తమ దాడి చేస్తాయేనన్న భయంతో ఆందోళన చెందుతున్నారు. ఇటీవల విచ్చలవిడిగా కుక్కలు సంచరిస్తున్నాయి. మండలంలో పలువురిని గాయపరిచిన ఘటనలూ ఉన్నాయి. సంబంధిత అధికారులు కుక్కల బెడదను నివారించడానికి ప్రత్యే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎల్ఓసిని అందజేసిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన విజయ ఆరోగ్యం బాగోలేనందున కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి శాస్త్ర చికిత్స స్పందించి వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.2,50,000 ఎల్ఓసీని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



బాధిత కుటుంబానికి ఎల్ఓసీని అందజేస్తున్న వినయ్‌రెడ్డి

ఒక్క సీసీ కెమెరా.. వందమందితో సమానం

- ఇందల్‌వాయి ఎస్‌హెచ్‌ఓ మనోజ్ కుమార్


నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానమని, ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను బిగించుకోవాలని ఇందల్‌వాయి ఎస్‌హెచ్‌ఓ మనోజ్ కుమార్ అన్నారు. మంగళవారం ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలోని 12వ వార్డులో 7 సీసీ కెమెరాలను ఇందల్‌వాయి ఎస్‌హెచ్‌ఓ మనోజ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లవెల్లి గ్రామంలోని పలు వార్డులో ఉన్న ప్రజల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, యువజన సంఘాలు ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉంటాయని అన్నారు. నల్లవెల్లి 12వ వార్డ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానమని, సీసీ కెమెరాతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. వార్డ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం వార్డు ప్రజలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, 12వ వార్డ్ సభ్యులు, కార్యదర్శి లావణ్య, ముచ్కూర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న దృశ్యం

అంబులెన్స్‌లో గర్భిణీ ప్రసవం



పండంటి బిడ్డతో గర్భిణి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గ్రామానికి చెందిన శివాని (23) రెండవ కానుపునకు రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాగా.. అక్కడ ప్రసవం జరగకపోవడంతో నిజామాబాద్ ఏరియా ఆసుపత్రికి 108లో తరలిస్తుండగా.. నవీపేట్ సమీపంలో పురిటి నొప్పులు అధికమవడంతో 108 సిబ్బంది వాహనాన్ని పక్కకు నిలిపి కాన్పు చేశారు. దీంతో ఆమె పండంటి పాపకు జన్మనిచ్చింది. ఆరోగ్య కేంద్రంలో కాన్పుకు ఇబ్బంది కలిగిన ఆమెను ఆరోగ్య సిబ్బంది కాన్పు చేయడం అభినందనీయమని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. 108 పైలెట్ నాగరాజు గౌడ్, డిఎల్ఎంటి, రాధాకృష్ణకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రమాదకరంగా మారిన వాగు

- వంతెన నిర్మాణం చేపట్టాలని రైతుల ఆవేదన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం నుంచి కందకుర్తి వెళ్లే ప్రధాన రోడ్డు మధ్య నుంచి వాగు ప్రవహిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుష్కరాల సమయంలో బోర్గం నుంచి కందకుర్తి వరకు నిర్మించిన ఈ రోడ్డు మధ్య భాగంలో వాగు ప్రవహిస్తుండడంతో రైతులకు తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుంది. సుమారు 1500 ఎకరాల ఆయకట్టు కలిగిన రైతాంగం ప్రతిరోజు ఈ రోడ్డు గుండానే తమ పొలాలకు వెళ్లాల్సి ఉంటుంది. వర్షాకాలంలో వాగు ఉధృతి పెరగడంతో తాము పంట పొలాలకు వెళ్లే పరిస్థితి లేదని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 200 మంది రైతులు ఈ రోడ్డు పై పంట పొలాలకు వెళ్లడానికి ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని వారు కోరుతున్నారు.



వాగులో నీటి ప్రవాహాన్ని చూపుతున్న రైతులు

వాయిదా పడిన పరీక్షలు 9కి రీషెడ్యూల్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

భారీ వర్షాల కారణంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి సూచన మేరకు తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని 2-సెప్టెంబర్‌న జరగాల్సిన థియరీ, ప్రాక్టికల్ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ పరీక్షలను సెప్టెంబర్-9న నిర్వహిస్తామని తెలంగాణా యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అరుణ తెలిపారు.

ఘనంగా క్షత్రియ విద్యా సంస్థల చైర్మన్ పుట్టినరోజు వేడుకలు



మొక్కను నాటుతున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

క్షతియ ఇంజనీరింగ్ కళాశాలలో క్షతియ విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ శ్రీ అల్జాపూర్ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని క్షతియ ఎన్ఎస్ఎస్ యునిత్ ఆధ్వర్యంలో మొక్క నాటే కార్యక్రమం సేవ భారతి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో వారి కుటుంబ సభ్యులు, అధ్యాపకులు విద్యార్థిని, విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అల్జాపూర్ లక్ష్మీనారాయణ, ట్రెజరర్ అల్జాపూర్ దేవేందర్, సెక్రటరీ అల్జాపూర్ గంగాధర్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ అల్జాపూర్ శ్రీనివాస్ కృషి, అంకుటిత దీక్ష కొనియాడదగినదని పేర్కొన్నారు. ఆ తర్వాత కేక్ కటింగ్ చేసి తర్వాత అల్జాపూర్ శ్రీనివాస్ గౌరవంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని కల్చరల్ టీమ్ ప్రతిమ చౌల సభ్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, విదార్థినీ విద్యార్థులు పాల్గొని అల్జాపూర్ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అలుగుపారుతున్న నాగపూర్ ఊర చెరువు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగాపూర్ గ్రామ ఊర చెరువు అలుగు పారుతుంది. గత నాలుగు రోజులకు కురుస్తున్న భారీ వర్షాలకు చెరువు ప్రాంతం నుండి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చెరువులో చేరడంతో చెరువు అలుగు పారడం ప్రారంభమైంది. అలుగు పైనుండి మత్తడి దూకుతున్న నీరు పరవళ్ళు తొక్కుతున్నాయి. పెద్ద ఎత్తున ప్రవహిస్తున్న అలుగునీరు మాటు కాలువ ద్వారా ఉప్లూర్ నల్లచెరువు వైపు పరుగులు పెడుతున్నాయి. ఊర చెరువు నిండుకుండలా మారి అలుగు పారుతుండడంతో గ్రామస్తులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువు వారి కట్టు కింద ఈ సంవత్సరం రెండు పంటలకు ఎలాంటి డోకా లేదని, పశుపక్షాదులకు తాగునీటికి ఇబ్బందులు ఉండవని పేర్కొంటున్నారు.



పారుతున్న ఊరచెరువు అలుగు

జ్వరం ఉంటే పరీక్షలు చేయించుకోవాలి

- సీజనల్ వ్యాధిగ్రస్తులను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-బాల్కొండ

జ్వరం ఉంటే పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ కేసును బాల్కొండ సిహెచ్ఓ సిహెచ్ మురళి, వైద్య సిబ్బందితో కలిసి పరీక్షించామని గ్రామపంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డెంగ్యూ కేసు నిర్ధారణ జరిగిన కాలనీలో డెంగ్యూ నివారణ చర్యలు చేపట్టారు. స్థానిక ఆరోగ్య సిబ్బందితో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇంటి చుట్టు ప్రక్కల ఇళ్లలో మస్కిటో లార్వా డెన్సిటీ నిర్వహించి ఆవరణలో నీరు నిల్వ ఉన్న వాటిపై యాంటీ లార్వా ఆయిల్ చల్లించారు. డెంగ్యూ వ్యాధి లక్షణాలు, నిర్ధారణ చికిత్స గురించి కాలనీవాసులకు వివరించారు. జ్వరం ఉన్నప్పుడు సొంతంగా మందులు వాడకుండా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముందస్తు జాగ్రత్తగా ఇంటి పరిసర ప్రాంతాలు శుభ్రత పాటిస్తే వ్యాధుల బారిన పడే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని తెలిపారు. వైద్య సిబ్బంది ఏఎన్ఎం జమునరాణి, ఆశా కార్యకర్తలు మాధవి, లక్ష్మీనర్సు, గంగామణి తదితరులు పాల్గొన్నారు.



పరిసరాలను పరిశీలిస్తున్న వైద్యులు, సిబ్బంది

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- డిచ్‌పల్లి సీఐ మల్లేష్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని డిచ్‌పల్లి సీఐ మల్లేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అరుంధతి ఫంక్షన్ హాల్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పీస్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన గణేష్ మండప నిర్వాహకులతో మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని తెలిపారు. విద్యుత్ కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. నిమజ్జన సమయంలో పాటించవలసిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, వినాయకమండలి సోదరులు, ముస్లిం సోదరులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ మల్లేష్

బాధితులకు భోజనాలు అందజేత



బాధితులకు భోజనం పెడుతున్న ఎమ్మార్వో, ఎంపీడీవో

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామంలో డబుల్ బెడ్రూంలో నీట మునిగి ఇబ్బందులు పడుతున్న వారిని తాత్కాలికంగా ప్రభుత్వ పాఠశాలలో పునరావాసం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. బాధితుల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మార్వో శివప్రసాద్, ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి మంగళవారం భోజన వసతిని కల్పించారు. ఆదివారం కురిసిన వర్షానికి డబుల్ బెడ్ రూమ్ ల నుండి తమ ప్రాణాలు కాపాడడం, తమ సొంత ఖర్చులతో భోజనాలు కల్పించిన ఎమ్మార్వో ఎంపీడీవో అధికారులకు బాధితులు ధన్యవాదాలు తెలిపారు.

పొంగిపొర్లుతున్న మల్లుపేట వాగు



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మల్లుపేట్ వాగు పొంగి పొర్లుతుంది. కురుస్తున్న భారీ వర్షాలకు అమర్లబండ, దర్మారావుపేట చెరువులు నిండడంతో మల్లాపేట్ వాగు పొంగిపోరులుతుంది. ఈ వాగు 44వ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్నది. ప్రయాణికులు చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

17 కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు

- దక్షిణ కాశి ఆలయానికి బీటీ రోడ్డు మంజూరు
- ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ

నవతెలంగాణ-భిక్కనూర్

ఇండ్లు లేని నిరుపేద కుటుం బాలకు ఇందిరమ్మ రాజ్యంలో పక్కా ఇండ్లు కట్టిస్తామని ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ తెలిపారు. మంగళవారం మం డలంలో ఆదివారం నుంచి కురుస్తు న్న వర్షాలకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి పరిశీలించారు. జాతీయ రహదారి నుంచి సిద్ధ రామేశ్వర ఆలయానికి రెండు వైపులా బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులతో మాట్లాడారు. సిద్ధ రామేశ్వర ఆలయ కమాన్ నుంచి ఆలయం వరకు రూ.1కోటి 63లక్షలతో బీటీ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినట్లు, తాత్కాలిక మరమ్మత్తుల కొరకు రూ.5లక్షల ధ్వంసమైన రోడ్లను పునరుద్ధరణ పనులు చేయాలని పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశించారు.

రామేశ్వర్‌పల్లి గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నీట మునిగి ఇబ్బందులకు గురైన వారిని వసతి గృహన్ని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన బాధితులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందని గత వర్షాకాలంలోనే డబుల్ బెడ్ రూమ్‌లో నివసిస్తు వారి ఇబ్బందులు పడుతున్న వారిని గత ప్రభుత్వానికి తెలియజేసిన పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి 17 కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని, సొంతంగా కట్టుకుంటామంటే రూ.5లక్షల మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు రాజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్, వీడీసీ అధ్యక్షులు సూర్యకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, మహిపాల్ రెడ్డి, సుదర్శన్, లింగారెడ్డి, నాయకులు, కార్యకర్తల, ఆయా శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

బాధితుల గోడు ఎమ్మెల్యేకు పట్టదా..?

- పట్టణానికే పరిమితమైతే ఎట్లా..? : కాంగ్రెస్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి గ్రామంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ లో నివసిస్తున్న బాధితుల బాధలను స్థానిక కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి గుర్తించి వెంటనే ఆదుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రామేశ్వర్ పల్లి రెడ్డి సంఘం మాజీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కామారెడ్డి నియోజకవర్గం లో వర్షాల కారణంగా నిరుపేద కుటుంబాల ప్రజలు ఇండ్లు కూలిపోయి పునరావాసం లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే ప్రజల కష్టాలు తెలుసుకోకుండా కామారెడ్డి పట్టణానికి పరిమితం అవుతున్నారని, ఓట్లు వేసి కామారెడ్డి నియోజకవర్గ ప్రజలు గెలిపిస్తే ప్రజల బాధలు తెలుసుకోవలసిన ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని తెలిపారు. ఆపద సమయంలో ఎమ్మెల్యే స్పందించి ప్రజల బాధలను గుర్తించి సమస్యలు పరిష్కరించాలని, గ్రామాల లో పర్యటించి ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పండిత్ రావుకు పరామర్శ

నవతెలంగాణ-మద్నూర్

మండల సీనియర్ నాయకులు పండిత్ రావు పటేల్ ఇటీవల ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి పడటంతో కాలు విరిగి శాస్త్ర చికిత్స చేసుకోవడం జరిగింది. మంగళవారం మాజీ జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ మాజీ జుక్కల్ ఎమ్మెల్యే ఎస్.గంగారం పెద్ద ఎక్లారా గ్రామాన్ని సందర్శించి వారి స్వగృహం పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాజీ ఎమ్మెల్యే పండిత్ రావు ఆరోగ్య స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల బీజేపీ అధ్యక్షులు తుకారం, ఎన్డీసీసీబీ డైరెక్టర్ రామ్ పాటిల్, వివిధ మండలాల అధ్యక్షులు, బీజేపీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ డయల్-100పై అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైమ్ కళాబందం కళాకారుడు భాస్కర్ తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలపై కళాబందం కళాకారులు పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాబంద కళాకారులు మాట్లాడుతూ.. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు పోలీసుల సాయం పొందాల్సి వస్తే, వెంటనే డయల్-100కు కాల్ చేయాలని తెలిపారు. అపరిచితుల వ్యక్తుల నుంచి ఎస్ఎంఎస్, ఈ మెయిల్, వాట్సప్‌ల ద్వారా వచ్చే బ్లూ కలర్ లింక్స్‌ను క్లిక్ చేస్తే, మీ మొబైల్‌లోని డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి పోతుందని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలన్నారు. బాలికలను ఎవరైనా వేధిస్తే శాఖ పరమైన పోక్సో కేసులు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హరిచంద్ర, జావిద్, కళాకారుడు భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ పోశెట్టి, ఉపాధ్యాయులు చిరేంజీవి, గోవింద్, అశ్విన్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని కంటైనర్ డ్రైవర్ మృతి



మృతి చెందిన సారుక్ ఖాన్

నవతెలంగాణ-కామారెడ్డి

ఆగిఉన్న లారీని కంటెయినర్ ఢీకొన్న ఘటనలో కంటెయినర్ డ్రైవర్ మృతిచెందాడు. కాగా ఎలాంటి సూచికలు లేకుండా రోడ్డుపై లారీని ఆపిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం అందాజ ఐదున్నర గంటల సమయంలో, హర్యానా నుండి జహీరాబాద్ వెళుతున్న కంటైనర్ లారీ, కామారెడ్డి పట్టణ శివారులో ఉన్న నేషనల్ హైవే పై గల నేషనల్ ఫ్యామిలీ దాబా వద్దకు చేరుకునే సరికి, అప్పటికే జాతీయ రహదారిపై నిర్లక్ష్యంగా, ఎలాంటి సూచికలు లేకుండా ఆపి ఉన్న ఒక తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీకి ఢీకొట్టింది. కంటైనర్ లారీ నడుపు రాజస్థాన్ రాష్ట్రం భారత్‌పూర్ జిల్లాకు చెందిన షారుక్ ఖాన్ (22) అక్కడికక్కడే మృతిచెందినట్లు పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ విషయంపై చనిపోయిన వ్యక్తి బంధువు అయిన అక్బర్ ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, నిర్లక్ష్యంగా, రోడ్డుమీద ఎలాంటి సూచికలు లేకుండా ఆపిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ రాజపండి, నివాసము తిరు నగర్ గ్రామము, మధురై జిల్లా అను వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి, లారీ డ్రైవర్‌నీ కస్టడిలోకి తీసుకున్నట్టు తెలిపారు.

ఊరుస్తున్న నీరు



కార్యాలయంలో చేరిన నీరు

- విద్యావనరుల కార్యాలయంలో విధులకు ఆటంకం
- పైకప్పు కూలుతుందేమోనని భయాందోళనకు గురవుతున్న సిబ్బంది

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కార్యాలయం భారీ వర్షాలకు ఊరుస్తుంది. కార్యాలయంలో వర్షపు నీరు చేరడం విధులకు ఆటంకాలు ఏర్పడడంతో కార్యాలయ బిల్డింగు ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనని కార్యాలయ సిబ్బంది భయాందోళనకు గురి అవుతున్నారు. కార్యాలయ పైకప్పు స్లాబు ఊరుస్తుంది. బిల్డింగు రూముల్లోకి నీటి బోటుకులు పడడం కంప్యూటర్లు ఇతరత్రా సామాగ్రి తడుస్తున్నాయని పైకప్పు కూలుతుందో నేమని భయమేస్తుందని సిబ్బంది తెలిపారు. మండల విద్యా వనరుల శాఖ కార్యాలయం పురాతనంగా మారింది భారీ వర్షాలకు స్లాబు కురుస్తుంది విధులు నిర్వహించడంలో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఇలాంటి బిల్డింగ్ పట్ల కార్యాలయంలో విధులు నిర్వహించాలంటే సిబ్బంది భయాందోళనకు గురి అవుతున్నారు. ఊరుస్తున్న బిల్డింగు పట్ల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

కుటుంబ నిర్ధారణ అనంతరం
అర్హతగల ప్రతిరైతుకు రుణమాఫీ

- ఏడీఏ లక్ష్మిప్రసన్న



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-సదాశివనగర్

రేషన్ కార్డు లేక రెండు లక్షల రుణమాఫీ కానీ రైతులు, కుటుంబ నిర్ధారణ చేసుకోవాలని ఏడిఏ లక్ష్మీ ప్రసన్న సూచించారు. అర్హత గల రైతులందరికీ రుణమాఫీ చేయనున్నట్టు తెలిపారు. సదాశివనగర్ మండలం పద్మాజీవాడి గ్రామ రైతు వేదికలో కొనసాగుతున్న కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అర్హత కలిగిన ప్రతి ఒకరికి రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్ష రుణమాఫీ చేస్తుందన్నారు. ఇప్పటికే మూడు విడతల్లో రెండు లక్షల లోపు రుణాలు రైతుల ఖాతాలో రాష్ట్ర ప్రభుత్వం జమ చేసినట్టు తెలిపారు. అనివార్య కారణాల ద్వారా రుణమాఫీ పొందని రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. రెండు లక్షల పైన రుణాలు తీసుకున్న వారికి ప్రభుత్వం నుండి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేవని వెల్లడించారు. ఆదేశాలు వచ్చిన వెంటనే రైతులకు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి,వ్యవసాయ విస్తీర్ణ అధికారి శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి




మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి జ్యోతి

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రం లోని ఎస్సి బాలికల, బీసీ బాలుర వసతి గృహలను మండల ప్రత్యేక అధికారిణి జ్యోతి, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. వసతి గృహం స్లాబ్ నుండి నీరు లీక్ కావడం ఇబ్బందులు పడుతున్నామని పై స్థాయి అధికారులకు సమస్య ను అందజేయాలనీ వార్డెన్‌లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు అందించే వైద్య సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో వార్డెన్లు శ్రీనివాస్, స్వామి, సిబ్బంది ఉన్నారు.

పునరావాస కేంద్రాల సందర్శన



పునరావాస కేంద్రంలో భోజనం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాల్లో నివాసపు ఇండ్లు పాక్షికంగా కూలిపోవడంతో, వారికి అధికారులు పునరావాస కేంద్రాలుగా పాఠశాలలను, కాలేజీలలో ఏర్పాటు చేయగా మంగళవారం ప్రత్యేక అధికారి రాజేశ్వర్, తహసిల్దార్ సువర్ణ, ఎంపీడీవో తిరుపతి రెడ్డి పరిశీలించారు. ఉప్పల్వాయి, గిద్ద, గోకుల్ తండాలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో రామారెడ్డి పిహెచ్సి వైద్యులు సురేష్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పునరావాస కేంద్రాల్లో పలువురు దాతలు ఆహారాన్ని అందజేశారు. మండల కేంద్రంలోని షెడ్యూల్ కులాల వసతి గృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, వార్డెన్ జైపాల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాగుపై వంతెనను నిర్మించండి



ప్రభుత్వ సలహాదారుడికి వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని మల్లు పల్లి గ్రామానికి వెళ్లే రహదారి వాగుపై వంతెనను నిర్మించాలని మల్లు పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రామ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వెంకటొరెడ్డి, సిద్ధ రామేశ్వర ఆలయ డైరెక్టర్ సిద్ధరామ్ రెడ్డి మంగళవారం ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ వర్షాకాల సమయంలో గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డుపై వర్ష కాలంలో వాగులో వర్షం నీరు కారణంగా గ్రామానికి వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయని సమస్యను షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చినందుకు గ్రామస్తుల తరుపున ధన్యవాదాలు తెలిపారు.

గోలి లింగాల్‌లో నేడు హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండలంలోని గోలి లింగాల్ గ్రామంలో నేడు(బుధవారం) హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు మెడికల్ ఆఫీసర్ సుజన్ కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో గల పీ హెచ్ సి లో ఆశ కార్యకర్తలతో సీజనల్ వ్యాధులపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నందున గ్రామాలలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగానే బుధవారం రోజు గోలి లింగాల్ గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు పునరావాసం ఏర్పాటు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన రాజపేట లచ్చమ్మ నివాసపు ఇల్లు కూలడంతో ఇది గమనించిన కాలనీవాసులు డీజే సంతు, సిద్ధిరాములు , నవీన్ వెంటనే లచ్చమ్మను కూతురు సిద్ధమను మనుమడు చరణ్ ను కాలనీలో గల సుభాష్ చంద్రబోస్ కమ్యూనిటీ హాల్ కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి డిఎల్పిఒ సురేందర్ పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య లచ్చమ్మ కుటుంబ సభ్యులను గ్రామపంచాయతీలో పునరావాసం కల్పించినట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

- సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సింగిల్ విండో చైర్మన్

నవతెలంగాణ-మద్నూర్

పెసర పంట మద్దతు ధర కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ అన్నారు. మంగళవారం సింగిల్ విండో ఆధ్వర్యంలో మద్దతు ధర కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ శ్రీనివాస్ పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెసర పంటకు మద్దతు ధర కల్పించిందని, క్వింటాలు ధర రూ. 8682 తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో సింగిల్ విండో డైరెక్టర్లు నర్సింలు గౌడ్, శివాజీ రాథోడ్ హైదల్వారూ రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరాస్ సాయిలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తూమ్ హనుమాన్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాలలో రుణమాఫీపై సర్వే

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్


నాగిరెడ్డిపేట్ మండలంలోని ఆత్మకూర్ జలాల్పూర్, ఎర్రరం మాసంపల్లి రామక్కపల్లి మాటూర్ అచ్చాయిపల్లి గ్రామాలలో మంగళవారం రోజు వ్యవసాయ శాఖ అధికారులు రుణమాఫీపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రుణమాఫీ కానీ రైతుల వివరాలను నమోదు చేసుకున్నారు కార్యక్రమంలో వ్యవసాయ అధికారి హరి వెంకట్ ప్రసాద్ ఏఈఓ భవిత, నిఖిత, దివ్య పాల్గొన్నారు.

పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం చేయొద్దు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో నర్సరీని మండల ప్రత్యేక అధికారి రజిత పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో శానిటేషన్, పారిశుద్ధ పనులు, మల్లు పల్లి గ్రామానికి వెళ్లే కాలువను, పోస్ట్ ఆఫీస్ లో పెన్షన్ పంపిణీని పరిశీలించారు. వర్షాకాలంలో గ్రామాలలో పారిశుద్ధ పనుల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని, దోమలు వ్యాపించకుండా ఫాగింగ్ చేయాలని కార్యదర్శి లక్ష్మికి సూచించారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాలలో కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి ఇల్లు కూలిపోతున్న ఇండ్లను గుర్తించి నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

భారీ వర్షాలకు 20 ఇండ్లు పాక్షికంగా ధ్వంసం



నవతెలంగాణ-రామారెడ్డి

అకాల వర్షానికి మండలంలో వివిధ గ్రామాల్లో 20 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని మంగళవారం ఎమ్మార్వో సువర్ణ తెలిపారు. మద్దికుంట 4, రెడ్డిపేట్ 1, పోసాని పేట్ 1, గోకుల్ తాండ 4, గిద్ద 3, రామారెడ్డి 3,ఇసన్న పల్లి 1, గొల్లపల్లి 2, ఉప్పల్వాయి 1దెబ్బతిన్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్మికులకు రెయిన్ కోట్ వితరణ

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణ కేంద్రంలోని గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు ప్రముఖ న్యాయవాది లింగాల రాజబాబు గౌడ్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో రెయిన్ కోట్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ కార్మికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి 28 మంది కార్మికులకు రెయిన్ కోట్ అందజేసినట్లు తెలిపారు. అనంతరం పంచాయతీ కార్మికులు రాజబాబు గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఘనంగా పొలాల అమావాస్య

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని తిమ్మానగర్ తదితర గ్రామాలలో మంగళవారం పొలాల అమావాస్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎడ్లను ఉదయమే స్నానం చేయించి రంగురంగులతో అలంకరించి బెల్లం పానకం సేవింపజేసి పంట చేనులోకి తీసుకెళ్లిన అనంతరం ఇంటికి తిరిగి ప్రయాణమైయ్యారు. పిమ్మట రంగు రంగుల వస్త్రాలతో ముస్తాబు చేసి గ్రామ హనుమాన్ ఆలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించారు. అనంతరం రాత్రి బెల్లం పోలెలను బసవన్నలకు నైవేద్యముగా ఆరగింప జెసి కుటుంబ సభ్యులతో పొలాల వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు , ఆయా పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని వారికి ఫ్యామిలీ గ్రూపింగ్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి, అంతంపల్లి గ్రామాలలో మంగళవారం రేషన్ కార్డు లేని కారణంగా రుణమాఫీ కానీ రైతులకు మండల వ్యవసాయ అధికారి రాధా ఫ్యామిలీ గ్రూపింగ్ ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని బ్యాంకు, ఆధార్ కార్డులలో తప్పుల సవరణ చేసుకొని రైతు వేదికలో ఏ ఈ ఓ లకు పత్రాలు సమర్పించాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రచారం చేయాలి

నవతెలంగాణ-భిక్కనూర్

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి ప్రచారం చేయాలని బిజెపి మండల అధ్యక్షులు రమేష్ కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండలంలోని భాగిర్థిపల్లి గ్రామంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడిగా యాదగిరి, ఉపాధ్యక్షులు స్వామి, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, బాబు, కోశాధికారిగా ప్రవీణ్ లను ఎన్నుకున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి పార్టీ బలోపేతం చేసే అభ్యర్థిని గెలుపొందే దిశగా గ్రామాలలో కార్యచరణ చేపట్టాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
బుధవారం | సెప్టెంబర్ 04, 2024 | www.navatelangana.com

చికిత్స కోసం ఆర్థికసాయం

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన ఎల్లుల్ల రితిక్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన 2006-07వ బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులతో పాటు, భీమ్‌గల్ సెల్ పాయింట్ యూనియన్ ఆధ్వర్యంలో రితిక్ వైద్య ఖర్చుల కోసం రూ.61,050 ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా రితిక్ తల్లిదండ్రులు తమకు ఆర్థికసాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.


ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

ప్రయివేటు విద్యాసంస్థల కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-బోధన్

ప్రైవేట్ కళాశాలల, పాఠశాలల నూతన కార్యవర్గాన్ని మంగళవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ముత్యాల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మిద్దెల రాజు, కోశాధికారిగా కృష్ణమోహన్, గౌరవ అధ్యక్షులుగా శ్రీనివాస రావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ముత్యాల హరికృష్ణ మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో నూతన కార్యవర్గంగా ఎన్నుకున్న ప్రైవేటు పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రైవేట్ కళాశాలలో పాఠశాలల సమస్యలపై ప్రభుత్వానికి విన్నవించి సమస్యలు పరిష్కారానికి తమవంతుగా కృషి చేస్తామని ఆయన తెలిపారు.



ముంపునకు గురైన సోయపంట

- బోర్గం గ్రామ సమీపంలో 500 ఎకరాల్లో నీటమునిగిన సోయపంట


నీట మునిగిన సోయపంట

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తమ పంట పొలాలు నీట మునిగి తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న సుమారు 500 ఎకరాలు నీట మునిగిందని వారు పేర్కొన్నారు. మహారాష్ట్రలోని విష్ణుపురి, భోలేగావ్ గేట్లను ఎత్తివేయడంతో వరద ఉధృతి తీవ్ర రూపం దాల్చి తీరప్రాంతాలలో చేతికి వచ్చిన రైతుల సోయా పంట నీట మునిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్థానిక వ్యవసాయ అధికారులచే సర్వే జరిపించి అర్హులైన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని వారు కోరారు. ప్రతి సంవత్సరం తమ పంట పొలాలు ముంపుకు గురై తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వరద ఉధృతిని ముందుగానే గమనించిన అధికారులు శ్రీరాంసాగర్ గేట్లను ఎత్తివేసినట్లయితే తమ పంటలు చేతికి వచ్చే అవకాశం ఉండేదని, గేట్లను తెరవడంలో జాప్యం చేయడం వల్లే తమకు నష్టం వాటిల్లుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఖసీముద్దీన్, రెంజల్ సింగిల్ విండో చైర్మన్ మొయినుద్దీన్, మేడి ఐలయ్య, ఎం శ్రీను, డి.రాము, కరీముద్దీన్, దేవదాస్, నిజాం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

- సీపీఐ(ఎం) నాయకుల డిమాండ్


మాట్లాడుతున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-వర్ని(రుద్రూర్)

నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని రక్షిత ఆత్మహత్యపై ప్రభుత్వం, పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ(ఎం) ఏరియా కమిటీ కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. మంగళవారం రుద్రూర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థిని రక్షిత ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని అన్నారు. విద్యా వ్యవస్థ మీద విద్యా శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం కూడా ఒక కారణమని అన్నారు. ఇటువంటి దుర్ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతికి కారణం అయిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. రక్షిత కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గంగాధర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల రుణమాఫీ నిర్ధారణ కార్యక్రమం

నవతెలంగాణ-ఎడపల్లి

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిన నేపథ్యంలో రుణమాఫీ కాని రైతుల కోసం వ్యవసాయాధికారులు రైతుల రుణమాఫీ నిర్ధారణ కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి సిద్ధిరామేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టారు. అందులో భాగంగా మండలంలోని మంగళ్‌పహాడ్ గ్రామంలో రుణమాఫీ కానీ రైతుల కొరకు క్షేత్రస్థాయిలో నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. రుణమాఫీ కానీ రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇంట్లో ఉన్న అందరి ఆధార్ కార్డులు, జిరాక్స్ ప్రతులను దరఖాస్తు ఫారానికి జతపరచాలన్నారు. భార్యాభర్తలు ఉంటే వారు కూడా తప్పకుండా హాజరుకావాలని, భర్త లేని ఒంటరి మహిళ ఉంటే, భార్య లేని ఒంటరి రైతులు ఉంటే ఆధార్ కార్డులు జిరాక్స్ ప్రతులను తీసుకొని నిర్ధారణ కేంద్రానికి హాజరు కావాలని ఆయన కోరారు. యాప్ ద్వారా రుణమాఫీ కానీ రైతుల ఫోటోలను తీసుకుంటున్నట్టు వివరించారు. రుణమాఫీ కానీ రైతులు సంబంధిత జిరాక్స్ ప్రతులను జతపరిచి దరఖాస్తు ఫారం నింపి రైతులు సంతకాలు చేసి సంబంధిత వ్యవసాయశాఖ అధికారులకు అందజేయాలని ఆయన రైతులను కోరారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-భీంగల్ రూరల్

పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్టులను బోధించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తేదీ 05.09.2024 వరకు తమ బయోడేటాను కళాశాలలో అందించాలని పేర్కొన్నారు. వివరాలకు 9848581970 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఫీవర్ సర్వే నిరంతరం చేపట్టాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ఫీవర్ సర్వే నిరంతరం చేపట్టాలని మెడికల్ అధికారి యేమిమా తెలిపారు. మంగళవారం పట్టణ కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ అధికారి మాట్లాడుతూ.. వర్షాకాలం ముగిసే వరకు ఏఎన్ఎంలు, సూపర్వైజర్లు, ఆశాలు గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రతిరోజు ఫీవర్ సర్వే చేయాలని, జ్వరం తీవ్రంగా ఉన్నవారికి డెంగ్యూ మలేరియా టెస్టులు చేయాలని సూచించారు. పది రోజుల్లో డెలివరీ అయ్యే గర్భిణీ స్త్రీల జాబితాను తయారుచేసి వారిని సురక్షిత ప్రాంతాలకు, సుఖవంతమైన ప్రసవం జరిగేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ రాణి, సూపర్వైజర్లు సువర్ణ, రాజమణి, తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే

- గణేష్ మండపాల నిర్వాహకులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందే
- ట్రాఫిక్ నియమాలను పాటించాలి
- డీజేలకు అనుమతి లేదు
- పోలీసుల సూచనలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

గణేష్ ఉత్సవాల సందర్భంగా వినాయకుడి ప్రతిమను ఏర్పాటు చేస్తున్నారా..? అయితే పోలీసు శాఖ నిబంధనలను తప్పకుండా పాటించాల్సిందే. నిబంధనలను అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవంటున్నారు పోలీసు శాఖ అధికారులు. ఈ నెల 9వ తేదీన వినాయకచవితి పండుగను పురస్కరించుకుని గణేష్ మండపాల నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నవతెలంగాణ ప్రత్యేక కథనం.

గణేష్ మండపాల నిర్వహకులు తమ వివరాలను తప్పనిసరిగా పోలీసులకు తెలియపరచాలి. ఇందుకోసం ముందుగా నిర్వహకులు తాము ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం తేదీ, ప్రదేశం, మొదలైన సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న వెబ్‌సైట్ https://police-portal.tspolice.gov.in ద్వారా లాగిన్ అయి మండపాల నిర్వహకులు పూర్తి వివరాలను నమోదుచేసుకోని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు జారీచేస్తారు. రిజిస్ట్రేషన్ అయ్యాక పోలీస్ స్టేషన్ నుండి వచ్చే అనుమతితో పాటు క్యూఆర్ కోడ్ (QR code)ని, వారు జారీ చేసిన సూచనల పట్టికను మండపం వద్ద అందరికీ కనపడే విధంగా ఉంచాలి. గణేష్ మండపాలలో షార్ట్ సర్క్యూట్ జరుగకుండా నాణ్యత గల కరెంటు వైరును ఉపయోగించాలి. మంటలు ఆర్పే సిలిండర్‌లను, ఇసుక బకెట్స్, నీళ్ల బకెట్స్‌లను మండపానికి సమీపంలో తప్పనిసరిగా ఉంచుకోవాలి. గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపం వద్ద తప్పని సరిగా ఏర్పాటు చేయాలి. నిమజ్జనం కోసం ప్రతి గణేష్ ప్రతిమ వెంట 5 గురిని నిమజ్జన బాధ్యత కోసం వారికి ప్రత్యేక టీ షర్ట్స్‌లో ఉండాలి. వృద్ధులు, చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా తక్కువ శబ్దకాలుష్యంతో కేవలం రెండు స్పీకర్లను ఒక మైక్ మాత్రమే ఏర్పాటు చేసుకోవాలి. మండపాల్లో ఎట్టిపరిస్థితులోను డీజేను ఏర్పాటు చేయరాదు. గణేష్ ప్రతిమలు కూర్చుండబెట్టే ప్రదేశంలో షెడ్ నిర్మాణంలో నాణ్యత గల షెడ్ ఏర్పాటు చేయవలెను. గణేష్ మండపంలో 24 గంటలు ఒక వాలంటీర్ ఉండే విధంగా నిర్వహకులు తగు చర్యలు తీసుకోవాలి. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట అడటం, లక్కీ డ్రాలు నిర్వహించడం, అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం, పాటలు పాడటంపై పూర్తిగా నిషేధమని తెలిపారు. విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి. పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం చేస్తారు. మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 100 గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి.



శాంతి, సామరస్యానికి మనం పాటుపడాలి

ప్రజలందరూ శాంతి, సామరస్యానికి పాటుపడాలి. వినాయక ఉత్సవాల నేపథ్యంలో సోదరభావంతో అందరూ కలిసి మెలిసి ఉత్సవాలను జరుపుకోవాలి. పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పటిష్ఠమైన పోలీసు భద్రత ఉంటుంది. మండపాలు ఏర్పాటు చేసే స్థలం పబ్లిక్ స్థలం అయితే సంబంధిత గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ అనుమతి పత్రం తీసుకోవాలి. ప్రవేట్ వ్యక్తుల స్థలం అయితే స్థలం యజమాని అనుమతి పత్రం తీసుకోవాలి. ఉత్సవాలు ముగిసే వరకు ఉత్సవ కమిటీ సభ్యులు 24 గంటలు మండపాల వద్ద అందుబాటులో ఉండాలి. భక్తులు వచ్చిపోయే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి. ట్రాఫిక్ అంతరాయం కలిగించొద్దు. వివాదాస్పద స్థలాల్లో గణేష్ మండపాలు ఏర్పాటు చేయొద్దు. ఇతరులను రెచ్చగొట్టే విధంగా, వివాదాస్పదంగా మండపాల వద్ద ప్రసంగాలు చేయవొద్దు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా అనుమతి అర్జీదారులు, ఉత్సవకమిటీ సభ్యులే బాధ్యత వహించాలి. డీజేలకు, బాణాసంచాకు అనుమతి లేదు. స్పీకర్ ద్వారా నిర్ణీత సమయం రాత్రి 10 గంటలలోపు మాత్రమే సంప్రదాయ సంగీతం ప్రసారం చేయాలి. ఇతరులను అవమానించే విధంగా, రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే చట్టపరంగా చర్యలుంటాయి.

- నిజామాబాద్ సిఐ నరహరి

లోతట్టు ప్రాంతాలకు వెళ్లొద్దు

- ఆర్డీఓ అంబాదాస్ రాజేశ్వర్

నవతెలంగాణ-బోధన్

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు లోతట్టు ప్రాంతాలకు పోకుండా జాగ్రత్త వహించాలని బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ అన్నారు. మంగళవారం బోధన్ మండలం హంగర్గా ముంపు గ్రామాన్ని ఆయన సందర్శించి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఎస్ఆర్ఎస్పీ బ్యాక్ వాటర్ గ్రామం సమీపంలో ప్రవేశించడంతో పంట పొలాలు నీటమునిగాయి. దాంతో ఆయన సంబంధిత శాఖ అధికారులను తీసుకొని గ్రామాన్ని సందర్శించారు. శిథిలావస్థకు చేరిన ఇంటిలో నివాసం ఉన్న ఒక కుటుంబాన్ని ఆయన సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని సూచించడంతో వారు వారి బంధువుల ఇంటికి చేరుకున్నారు. గ్రామంలో నీటి ప్రవాహం తగ్గినప్పుడు నష్టపోయిన పంట వివరాలను నమోదు చేసుకుని వివరాలు అందించాలని ఆయన వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ఇంచార్జ్ ఏడిఏ సంతోష్ కుమార్, తహసిల్దార్ విఠల్, గ్రామ పెద్దలు గంగాధర్, శ్యామ్‌రావు తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్

నేడు రాష్ట్రపతి అవార్డు గ్రహీత
ఈరవత్రి రాందాస్ సంస్మరణ సభ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కేంద్రానికి చెందిన రాష్ట్రపతి అవార్డు గ్రహీత విశ్రాంత హెడ్మాస్టర్ ఈరవత్రి రాందాస్ సంస్మరణ సభను బుధవారం పట్టణంలోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని రాందాస్‌కు శ్రద్ధాంజలి ఘటించాలని వారి కుటుంబ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా వారి కుమారుడు చార్టెడ్ అఫ్ అకౌంటెంట్(సీ.ఏ) ఈరవత్రి రాజశేఖర్ మాట్లాడుతూ.. 'మా నాన్న విధి నిర్వహణలో ఎందరెందరో విద్యార్థుల్ని జాతి గర్వించే ఉత్తములుగా ఉన్నతులుగా తీర్చిదిద్దారు. విద్యా రంగంలో 40 సంవత్సరాలు ఎనలేని సేవలు అందించారు. వారి సేవలను అభినందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది. ఐదు దశాబ్దాల నుండి ఆర్మూర్ ప్రాంతంలో ఉత్తమమైన సేవలందించి 2002లో "ఉద్యోగ విరమణ" పొందారు. విద్యార్థులకు కఠినాంశాలైన మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్‌లలో తన నిష్ణాతమైన పరిజ్ఞానంతో విద్యార్థులను అర్థం చేయించి, ఉన్నత స్థానాలలో నిలిపిన ఘనత గల గురుదేవులు. గురువు అంటే ఇలా ఉండాలి అని చాటి చెప్పిన గురువులకే గురువు. ఈనాడు మన అందరికీ దూరమై అకాల మరణం పొందారు. గురువు మీద ప్రేమతో సంతాప సభకు హాజరు కావాలి.' అని (సీ.ఏ) ఈరవత్రి రాజశేఖర్ తెలిపారు



ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-బోధన్

వికలాంగుల హక్కుల జాతీయవేదిక జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఏ.రమేష్ బాబు, జిల్లా అధ్యక్షులుగా గైని రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా యేశాల గంగాధర్, జిల్లా కోశాధికారిగా రామ్ పటేల్, జిల్లా కార్యనిర్వాక అధ్యక్షురాలుగా కవితరెడ్డి, ఉపాధ్యక్షులుగా గోపాల్, నజీర్, సాయమ్మ, నాగమణి, పట్టణం సహాయ కార్యదర్శులుగా గోపాల్‌గౌడ్, బోధన్ రూరల్ మండలం సింగాడి లక్ష్మణ్, సాలూర మండల కన్వీనర్‌గా భాను, నిజామాబాద్ టౌన్ లక్ష్మి, నిజామాబాద్ రూరల్ కమిటీ సభ్యులుగా శ్రీనివాస్, బోధన్ మండలం నేహాల్, బోధన్ టౌన్ గంగారం, పోతంగల్ మండలం జి శ్రీనివాస్, కోటగిరి మండలం సాయిలు, ఎడపల్లి మండలం పెంట సాయిలు, రెంజల్ మండలం కుమార్, నవపేట్ మండలం పల్లికొండ చింటూ తదితరులను ఎన్నుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వికలాంగుల హక్కుల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ పథకాల అమలులో వారికి అందించడంలో అనేక విషయాలలో తోడ్పాటు అందజేయడానికి తనవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్పీఆర్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మటపతి గంగాధరప్ప, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్ప లింగం, గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జంగం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యవర్గం

గాజుల్‌పేట్‌లో శాంతి కమిటీ సమావేశం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలని నిజామాబాద్ రెండవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ యాసిర్ అర్పత్ తెలిపారు. మంగళవారం నగరంలోని గాజుల్‌పేట్‌లో గల పద్మశాలి సంఘంలో రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు పిస్ కమిటీ (శాంతి కమిటీ సభ్యులు, కుల మతాల పెద్దలు) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఈ నెలలో వినాయక చవితి పండగ ఉన్నందున ప్రజలు వినాయక చవితి నిర్వాహకులు పోలీసులు సూచించిన సూచనలను తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న పెద్దలు తమ తమ కాలనీలలో యువతతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలతోపాటు, పద్మశాలి సంఘం సభ్యులు, కుల మత పెద్దలు, యువత, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ

ప్రమాదకర కల్వర్టు.. ఎట్టకేలకు భారీ కేడ్లు..

- ఇప్పటికీ రాత్రివేళ వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం
- అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలి



కోతకుగురైన రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన బారీ కేడ్లు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం నుండి ఉప్లూర్ వెళ్లే దారిలో భారీ వర్షాల మూలంగా కోతకు గురై ప్రమాదకరంగా మారిన వరద కాలువ సమీపంలోని కల్వర్టు వద్ద ఎట్టకేలకు అధికారులు భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు వద్ద రెండు వైపులా బీటీ రోడ్డుకు పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గత మూడు నాలుగు సంవత్సరాలుగా ఈ కల్వర్టు భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి బిటి రోడ్డు పైనుండి వరద నీరు ప్రవహించి, ప్రవాహం దాటికి కోతకు గురవుతూనే ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బీటీ రోడ్డు మరికాస్త కోతకు గురై కల్వర్టు వద్ద రెండు పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. తరచూ కోతకు గురవుతూ ప్రస్తుతం బీటీ రోడ్డు సగం వరకు పెద్ద గుంత ఏర్పడింది. రాత్రి సమయంలో వాహనదారులు ఏమరుపాటుగా వస్తే ఆ గుంతలో పడి ప్రమాదాలకు గురై ఆస్కారం ఉన్న నేపథ్యంలో అధికారులు ఎట్టకేలకు స్పందించారు. కల్వర్టు ఏర్పడ్డ రెండు గుంతలకు ఇరువైపులా రెండు భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. అయితే తాత్కాలిక రక్షణ ఏర్పాట్లు కాకుండా అధికారులు స్పందించి గతంలో ప్రశాంత్ రెడ్డి మంజూరు చేయించి, రద్దయిన నిధులను కాంగ్రెస్ నాయకులు మంజూరు చేయించి కల్వర్టు బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో పోలీసుల భద్రత



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత 3రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాలకు మేరకు ఈ భారీ వర్షాల సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు వివరిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం పోలీసులు ఆటోలో పెట్రోలింగ్ ద్వారా ప్రతి గ్రామానికి వెళ్లి.. అక్కడ ప్రజలతో మాట్లాడి.. అవగాహన కల్పిస్తున్నామని ఇందల్‌వాయి ఎస్‌హెచ్ఓ మనోజ్ కుమార్ తెలిపారు. ఈ వర్షాల కారణంగా వెంగళ్‌పాడ్ (పాటి తండా) సమీపాన నూతన బ్రిడ్జి నిర్మాణం పక్కనుంచి వేసిన రాహదారి అధిక నీటి ప్రవాహంతో కొట్టుకుపోవడంతో అ దారిని మూసివేసి అక్కడ ఒక పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అంతే కాకుండా ప్రతి సెన్సిటివ్ పాయింట్స్‌ను గుర్తించి రెండు గంటలకు ఒకసారి సందర్శించి తనిఖీ చేస్తున్నట్టు వివరించారు. ఎవరైనా శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉన్నట్లయితే వారిని అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్టు తెలిపారు. ఏదైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలుపాలని ప్రజలను కోరారు.

పాఠశాలలో చోరీ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. భారీ వర్షాల కారణంగా ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాఠశాల మూసి ఉన్నది. మంగళవారం పాఠశాల స్థితిగతులను రిపోర్ట్ చేయామని ఎంఈఓ స్వామి పాఠశాలలకు తెలిపారు. ఎంఈఓ ఆదేశాల మేరకు పాఠశాలను ఉదయం వెళ్లే సమయానికి ఉపాధ్యాయుల, స్టాఫ్ రూముల తలుపులు పగిలిపోయి రూమ్‌లోని బీరువాలను పగలగొట్టి చిందరవందరగా వస్తువులు పడి ఉన్నాయి. రూమ్‌లో ఉన్న క్రీడా సామగ్రి చెస్ బోర్డులు, క్యారం బోర్డులు, వాలీబాల్స్ గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. టేబుల్స్‌ను, చేర్లను ధ్వంసం చేశారు. ఇది గమనించిన అధ్యాపకులు ఎస్సై మహేష్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. పాఠశాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పాఠశాల హెడ్మాస్టర్ గంగాధర్ కోరారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | సెప్టెంబర్ 04, 2024 | www.navatelangana.com

ఎమ్మెల్యేను కలిసిన బీజేవైఎం జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఆర్మూర్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తను బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్‌రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గత కొన్ని రోజుల క్రితమే జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులచారి నియామకపు పత్రాన్ని అందజేసినట్లు సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్‌రెడ్డికి ఆర్మూర్ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బిజెవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిండుగా ప్రవహిస్తున్న మంజీరా

నవతెలంగాణ-పోతంగల్



మండలంలో మంజీరా నది నిండుగా ప్రవహిస్తుంది. మండలంలోని గ్రామాలు నది పరివాహక ప్రాంతాలైనందున గ్రామాలన్ని చిత్తడిగా తయారయ్యాయి. గ్రౌండ్ వాటర్ లెవెల్ పెరిగింది. మెట్ట పంటలపై, కూరగాయల సాగుపై ప్రభావం పడింది. చెరువులు, కుంటలు నిండుకున్నాయి. నీటి నిర్వహణ సక్రమంగా చేస్తే రాబోయే కాలంలో తాగునీటికి, సాగు నీటికి కొదవ ఉండదని ఇరిగేషన్ అధికారులు చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వివాదాలు పెంచుకోవొద్దు

- విలువైన జీవితాలను పాడుచేసుకోవొద్దు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత

నవతెలంగాణ-ఆర్మూర్

కుటుంబ సభ్యులతో వివాదాలు పెంచుకొని విలువైన జీవితాలను పాడు చేసుకోవద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత అన్నారు. పట్టణంలోని మేరు సంఘం భవనంలో తెలంగాణ హైకోర్టు సౌజన్యంతో కమ్యూనిటీ మిడియేషన్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. ప్రజలు తమ తమ కుటుంబాలలో, వ్యాపార వ్యవహారాలలో జరిగే చిన్న చిన్న అనేక రకాల సమస్యలతో పగ, ప్రతికారము, ఇగోనెస్ లాంటి సమస్యలద్వారా కోర్టుల చుట్టూ, పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, ధనాన్ని వెచ్చించి రక్త సంబంధాలను, స్నేహాలను పాడుచేసుకొని కుటుంబ సభ్యులతో వివాదాలు పెట్టుకొని ఒంటరి జీవితం గడుపుతున్నారని తెలిపారు. అలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కొరకు మెడియేషన్ సెంటర్ల ద్వారా ట్రేనింగ్ పొందిన సభ్యులతో కౌన్సెలింగ్ ఇప్పించి వారికి తగిన న్యాయం ఎలాంటి ఫీజులు చెల్లించకుండా చట్టరీత్యా చట్ట బద్ధంగా సేవలు చేయడానికి ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అందులో భాగంగా పరిష్కరించబడిన కేసులను డిఎల్ఎస్ఏ ద్వారా అవార్డులను సైతం ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ జడ్జి నజీమ్ సుల్తానా, జూనియర్ జడ్జ్ దీప్తి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్ పద్మావతి, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, ఏసిపి బస్వారెడ్డి, స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్, డిఎల్ఎఫ్ సూపరింటెండెంట్ పురుషోత్తమ్ గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తెడ్డు నర్సయ్య, మేరు సంఘం అధ్యక్షులు రావినాథ్, మెడియేషన్ ప్రతినిధులు లయన్ నివేదను గుజరాతి, బాబాగౌడ్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ అశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

అధిక వర్షాల ప్రభావం ఇంకా ముగిసిపోనందున అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రాణా, ఆస్తి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కామారెడ్డి కలెక్టర్ అశిష్ సాంగ్వాన్ అన్నారు. అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ కలెక్టర్ కార్యాలయం నుండి డివిజన్, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అధిక వర్షాలతో దెబ్బదిన్న రహదారులను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి వెంటనే రిపేర్ చేయాలని అన్నారు. అధిక వర్షాల వలన చనిపోయిన వారి వివరాలు, దెబ్బతిన్న ఇండ్ల వివరాలను అందించాలని రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. అధిక వర్షాల వలన పాఠశాల భవనాలు దెబ్బతిని ఇబ్బందిగా మారిన పాఠశాలల వివరాలను అందించాలని, అవసరం అనుకుంటే పాఠశాలను సరి చేసేవరకు సెలవులు ఇవ్వాలని, విద్యాశాఖ అధికారులకు సూచించారు. వంగిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. వ్యాధుల ప్రబలకుండా అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలలో పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. వైద్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్..

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఈ సంవత్సరం, పర్యావరణంపై అవగహన కల్పించేందుకు మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోని పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలలో భాగంగా 8 అంగుళాల మట్టి గణపతిలను అందించి పర్యావరణంపై పెద్దఎత్తున అహగహన కార్యక్రమాలు టిజిపిసిబి నిర్వహిస్తుందని తెలపారు. అవగాహన కార్యక్రమాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యావరణ గణేష్ పోస్టర్ల ప్రదర్శన ఆటోట్రాలీల ద్వారా పర్యావరణ సందేశాలతో ప్రదర్శన, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపట్టేందుకు టిజిపిసిబి సిద్ధమవుతుందన్నారు. మట్టి గణపతి ద్వారా పర్యావరణ పరిరక్షణపై పాఠశాలలో, కళాశాలల్లో క్విజ్ కార్యక్రమాలు నిర్వహించడం, చేతివృత్తుల వారికి మట్టి విగ్రహాలు తయారీపై శిక్షణ, ఆటోల వెనుక, పోస్టర్ల ప్రదర్శన, బస్టాప్‌లలో హెూర్డింగ్‌లు మట్టి గణేష్‌ల ద్వారా పర్యావరణ పరిరక్షణపై కళాజాత నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చెరువుల్లో మట్టి మేటలను తొలగించటానికి చెరువులో స్వచ్ఛతను కాపాడటానికి వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తులు నడుం బిగించాలని మట్టితో వినాయక విగ్రహాలు తయారుచేసి భక్తితో చెరువులోకి చేర్చొచ్చన్నారు.

భజన మండలి భక్తులకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పిప్రి గ్రామంలో భజన మండలి భక్తులకు దుస్తులు పంపిణీ చేసి సన్మానించినట్టు గ్రామ అధ్యక్షులు సుంకం భూషణ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 18 సంవత్సరాల నుంచి పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గుండ చిన్నరెడ్డి, కె.బాబురెడ్డి, నవీన్, నరసయ్య, గంగారం, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తాగిన మైకంలో 100కు ఫోన్

- వ్యక్తికి ఒక రోజు జైలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తాగిన మైకంలో డయల్ 100 నెంబర్‌కి ఫోన్ చేసిన వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష పడినట్లు రెండవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ యాసిర్ అరాఫత్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బాబన్ సహాబ్ పహాడ్‌కి చెందిన నదీం అనే వ్యక్తి రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చి ఆర్ఆర్ చౌరస్తా దగ్గర దారి వెంట నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి దగ్గర ఫోన్ తీసుకొని అవసరం లేకున్నా అనవసరంగా 100 నెంబర్‌కి కాల్ చేసి పోలీస్ అవసరం ఉందని తాగిన మైకంలో చెప్పగా.. పోలీసులు అతని లొకేషన్ తెలుసుకొని అతని దగ్గరికి వెళ్లి సమస్య ఏంటని అడిగారు. ఊరికే చేశాను అని చెప్పారు. తాగిన మత్తులో 100 నెంబర్‌కి ఫోన్ చేసి పోలీసులను తప్పుదోవ పట్టించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. కోర్టు అతనికి ఒక రోజు జైలు శిక్ష విధించారని తెలిపారు.

సోదరభావంతో పండుగలు చేసుకోవాలి

- పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పోలీసులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గణేష్ చవితి ఉత్సవాల సందర్భంగా ప్రజలు సోదరభావంతో పండుగలు జరుపుకోవాలని డిచ్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లేష్, ఎస్‌హెచ్ఓ మనోజ్ కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఇందల్‌వాయి పోలీస్‌స్టేషన్‌లో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు రాబోవు వినాయక చవితి పండుగల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఏ పండుగ వచ్చినా కలిసి మిలిసి సోదరభావంతో జరుపుకోవాలని సూచించారు. ఎవరైనా అశాంతి సృష్టించే ప్రయత్నం చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో మతపెద్దలు, మండపాల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో భారీ చోరీ

- పది తులాల బంగారం, లక్ష నగదు అపహరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ జరిగినట్టు ఐదవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ గంగాధర్ మంగళవారం తెలిపారు. ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఐదో ఠాణా పరిధిలో గల బ్యాంక్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాస్ కుటుంబం హైదరాబాద్‌కు వెళ్లారు. అయితే సోమవారం రాత్రి దొంగలు ఇంట్లో చొరబడ్డారు. బెడ్రూంలో బీరువాలో దాచి ఉంచిన పది తులాల బంగారం, రూ.లక్ష నగదు అపహరించుకెళ్లారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై గంగాధర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోటగిరిలో దెబ్బతిన్న ఇండ్లు

- పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-కోటగిరి

మండలంలో గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. మంగళవారం కోటగిరిలో పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లను ఆర్ఐ సయ్యద్ పరిశీలించారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు వెళ్లాలని ఎస్ఐ సందీప్ పేర్కొన్నారు. ఇప్పటివరకు ఎటువంటి ఘటన జరగకపోవడంతో అధికారులు నష్టపోయిన పంట పొలాలను అంచనా వేస్తున్నారు. కోటగిరిలో రెండు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

విద్యార్థి రక్షిత మృతిపై విచారణ జరపాలి

- డిసిపికి విద్యార్థి సంఘాల వినతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వ్యవసాయ పాలిటెక్నిక్‌లో మొదటి సంవత్సరం చదువుతున్న రక్షిత మృతిపై సమగ్ర విచారణ జరపాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, యుఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది సూరి డిమాండ్ చేశారు. పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, పివైఎల్, బీఎస్పి విద్యార్థి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలో పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో డిసిపికి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న రక్షిత శనివారం ఉదయం హాస్టల్ బాత్రూంలో ఉరికి వేలాడుతూ మృతదేహం ఉందని, కళాశాల ప్రిన్సిపాల్ వారి తల్లిదండ్రులు వచ్చేదాకా ఆపకుండా బోధన్ ఆసుపత్రికి తరలించారని, అదేవిధంగా విద్యార్థి చనిపోయే ముందు హాస్టల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని టెక్నికల్ కారణాల వలన అది డిలీట్ అయిందని కారణాలు చెప్పడం పలు అనుమానాలకు దారితీసిందని తెలిపారు. విద్యార్థులకు పాఠాలు చెప్పే అనేకమంది మహిళా లెక్చరర్స్ ఉండగా పురుషులనే ఎందుకు వార్డెన్‌గా నియమించారని, లోపల ఏం జరిగిందో విషయాలను బయట చెప్పకుండా మొదటి సంవత్సరం విద్యార్థులను అదే రోజు ఇంటికి పంపించడం మరిన్ని అనుమానాలకు దారితీసిందని పేర్కొన్నారు. కావున విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నిన్న ఘటన వివరాలను తెలుసుకోవడానికి వెళ్లిన విద్యార్థి సంఘం నాయకులపైన కేసులు నమోదు చేశారని, వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల, ప్రజా సంఘాల నాయకులు నడిపింటి కార్తీక్, వనమాల సత్యం, బండమీద నర్సయ్య, సిద్దల నాగరాజ్, ప్రిన్స్, పోచమైన మహేష్, దేవిక, రవీందర్, రాకేష్, జవహర్, సురేందర్ పాల్గొన్నారు.



డిసిపికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

పలు డివిజన్లలో మున్సిపల్ కమిషనర్ పర్యటన

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ మంగళవారం నగరంలోని పలు డివిజన్లలో పర్యటించారు. అందులో భాగంగా మొదట 21వ డివిజన్ ఎల్లమ్మగుట్ట తదితర ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. డెంగ్యూ సోకిన ఇంటి పరిశుభ్ర ప్రాంతాలను పరిశీలించారు. అలాగే ఆ కుటుంబంతో పాటు చుట్టుపక్కల ఉన్న ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పలు సూచనలను తెలియజేశారు. మున్సిపల్ సిబ్బందికి పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం డివిజన్ 19లోని రోడ్ల డ్యామేజ్‌లో అలాగే గుంతలుగా రోడ్లు ఏర్పడడంతో వాహనదారులకు ఇబ్బందులు కలుగుతాయని ఎక్కడికక్కడ మున్సిపల్ సిబ్బంది గుంతలను పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

రాత్రి సమయంలో ఆకస్మికంగా తనిఖీలు..

నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ సోమవారం రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై నిజామాబాద్ నగరంలో జోన్ పరిధిలలో ఆకస్మికంగా తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీలలో సిబ్బంది పనితీరు రాత్రి సమయంలో ఏ విధంగా ఉంది ఏం చేస్తున్నారు. అనే ఉద్దేశంతో తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. జోన్ 3 కంఠేశ్వర్ ప్రాంతంలో రాత్రి సమయంలో విచ్చేసి అక్కడున్న రికార్డులను పరిశీలించి రాత్రి సమయంలో డ్యూటీలో ఉండే సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఎవరెవరు విధులలో ఉన్నారు, అక్కడున్న సిబ్బందిని అడిగి రాత్రి సమయంలో తమ విధులను చక్కగా నిర్వహించాలని సూచించారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- సరిచేయాలని కోరుతున్న కాలనీవాసులు

నవతెలంగాణ-ఎడపల్లి

వర్షాకాలం దృష్ట్యా కొన్ని రోజుల నుంచి వర్షాలు ఏకధాటిగా కురవడంతో ఈదురుగాలుల ప్రభావానికి విద్యుత్ స్తంభాలకు ఉండే విద్యుత్ వైర్లు ఇండ్లను తాకేవిధంగా వేలాడుతున్నాయని మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన ఓ కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ తీగలు ఇండ్ల మీద పడే అవకాశాలున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ వైర్లను సరిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ విషయంపై లైన్‌మెన్ బాలరాజును వివరణ కోరగా.. గ్రామంలో ఉన్న విద్యుత్ స్తంభాలతో పాటు, కరెంటు తీగలను సరి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.



మొగిలి చెరువు కట్ట పరిశీలన

నవతెలంగాణ-భీంగల్ రూరల్



మండల కేంద్రంలో అయ్యప్ప నగర్ మొగిలి చెరువును బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి కాలనీ వాసులతో మాట్లాడారు. చెరువు కట్టను పెంచి పటిష్టపరుస్తామని తెలిపారు. ఇదివరకే కబ్జాకు గురైన ప్రాంతాన్ని రెవెన్యూ అధికారులు కబ్జా నుంచి తీశారని త్వరలోనే సరిహద్దులు కూడా తీస్తామని తెలిపారు. అన్ని చర్యలు తీసుకొని మొగిలి చెరువును పునరుద్ధరణ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణకై.. వైద్య శిబిరం

- జిల్లా వైద్యాధికారి రాజశ్రీ

నవతెలంగాణ-ఎడపల్లి

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య రక్షణకై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారిని రాజశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని జానకంపేట గ్రామంలోని ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రంలో జ్వారాల నివారణ ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం, క్యాంపును ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిణి మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యులు మానవతా దృకృథంతో రోగుల కావాల్సిన వైద్య సేవలను అందించాలని తెలిపారు. సాయి స్థాపిర్దోస్ రోజు వారిగా మండలంలో ఉన్న ఎనిమిది ఆరోగ్య ఉప కేంద్రాలను అక్కడ విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంల పనితీరును పరిశీలించి గ్రామంలోని ప్రజల ఆరోగ్య విషయాలను అడిగి తెలుసు కోవడం అభినందనీయమన్నారు. ప్రతి ఇంటిలో జ్వరాలతో బాధపడుతున్న రోగులకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి రోగులు ఆరోగ్యంగా ఉండేందుకు వైద్యులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. మండలంలో ఎనిమిది ఆరోగ్య ఉప కేంద్రాలు నందున్న కేంద్రంలోని ఏఎన్ఎంలు కేంద్రాల పరిధిలోని గ్రామంలోని ప్రతి వీధిని ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్ర మంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సాయిస్తా ఫిర్దోస్, సూపర్‌వైజర్ రాజేశ్వర్, నాగేందర్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

గణేష్ విగ్రహ ప్రతిమల ఏర్పాటుకు ఆన్‌లైన్ ద్వారా సమాచారం అందించాలి

- సీపీ కల్మేశ్వర్ వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

గణేష్ విగ్రహ ప్రతిమల ఏర్పాటుకు ఆన్‌లైన్ ద్వారా సమాచారం అందించాలని సీపీ కల్మేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. రానున్న వినాయక చవితి ఉత్సవాలను నిర్విఘ్నంగా జరుపుకోవడంలో ఉత్సవ కమిటీలు, యువజన సంఘాలు పోలీసులకు సహకరించాలని పేర్కొన్నారు. ఈ నెల 7న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని అన్ని గణేష్ మండపాలకు సెక్యూరిటీ ఇవ్వడానికి, పాయింట్ బుక్ ఏర్పాటు కోసం సమాచారం ఇవ్వాలని సూచించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలలోని అన్ని గ్రామాలలోని ఆయా వీధులలో గణపతిని ప్రతిష్ఠించుకునే సంఘాల వారు/కాలనీల వారు http://policeportal.tspolice.gov.in తెలియజేసిన లింక్ ద్వారా సమాచారం అందించాలని తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE IV ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-THE SPECIAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS FOR TRIAL OF CASES UNDER T.S. PROHIBITION & EXCISE ACT AT NIZAMABAD
O.S. No. 230 OF 2021

Between:-
Sri. Bigulla Suresh ..Plaintiff
And
Shri. Peesari Naveen. ...Defendant

To,
Sri Peesari Naveen S/o Peesari Lingam @ Peesari Pedda Lingam, Hindu, aged 41 Years, Occ: Business, R/o H.No.1-4-50, Opp: Bharath Band, Near Gole Hanuman Temple, Nizamabad., residing near Sri Sri Dattaguru Super Market behind Second House, IInd Floor, Bombay Bakery Beside Lane, Srinagar Colony, Vinayaik Nagar, Nizamabad. Cell No. 9059633456, 7731097661. ...Defendant.

Take notice that the above Petitioner/Plaintiff has filed the above suit for Recovery of Money against Sri. Peesari Naveen i.e., defendant herein, vide O.S. No.230 of 2021 on the file of the Hon'ble IV Addl. Junior Civil Judge-cum- The Special Judicial Magistrate of First Class for Trial of Cases under T.S. Prohibition & Excise Act at Nizamabad.

The above O.S. No. 230 of 2021 is posted for your appearance on **26.09.2024** before the Court of Hon'ble IV Addl. Junior Civil Judge-cum- The Special Judicial Magistrate of First Class for Trial of Cases under T.S. Prohibition & Excise Act at Nizamabad.

You are hereby informed to appear before the Court of Hon'ble IV Addl. Junior Civil Judge-cum-The Special Judicial Magistrate of First Class for Trial of Cases under T.S. Prohibition & Excise Act at Nizamabad, at 10.30 A.M on **26.09.2024** either in person or through Advocate and file objections (if any). Otherwise the matter shall be decided as ex-parte.

// BY ORDER OF THE COURT //
THROUGH:-
B.SHIVA SWAROOP
Advocate Nizamabad.